ప్రజాశక్తి
మంగళవారం 26 మార్చి 2024 5 అనంతపురం





మృతి చెందిన అంజలి భర్తతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారిణి

టిడిపి నాయకుడి దారుణ హత్య



హత్యకు గురైన దుద్దకుంట అమర్‌నాథ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీ సత్యసాయి జిల్లా పట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం కటాలపల్లి గ్రామంలో టిడిపి నాయకుడు ఆదివారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. తోట వద్ద నిద్రించిన దుద్దుకుంట అమర్నాథ్‌రెడ్డి(40)ను గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. కాగా ఈ హత్య రాజకీయ హత్యని టిడిపి నాయకలు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం హత్యలో రాజకీయ కోణం లేదని, వ్యక్తిగత ఘర్షణలతోనే హత్య జరిగినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలినట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా ఎన్నికల సమీపిస్తున్న వేళ టిడిపి నాయకుడు హత్యకు గురికావడంతో తీవ్ర సంచలనం రేపుతోంది.

వార్త మెయిన్‌లో

పోలీసు స్టేషన్‌లో 'బంగారం' వాహనం..!

రూ.15 కోట్లు విలువజేసే బంగారు, వజ్రాలు ఉన్నట్లు సమాచారం



బంగారు ఆభరణాలతో పట్టుబడిన వాహనం

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద బంగారు నగలను తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని ఎన్నికల తనిఖీ అధికారులు పట్టుకున్నారు. ఇందులో ఓ ప్రముఖ బంగారు షాపునకు చెందిన రూ.15 కోట్ల విలువజేసే బంగారు ఆభరణాలు, వజ్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. వాహనాన్ని పట్టుకున్న అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఉంచుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సోమవారం ఉదయం చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఎన్నికల సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా బెంగుళూరు నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న జీపును తనిఖీ చేయగా అందులో ఓ ప్రముఖ బంగారు నగల షోరూంకు సంబంధించిన బంగారు నగలు, వజ్రాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన పత్రాల పరిశీలన నిమిత్తం జీపును చిలమత్తూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీటి పరిశీలన నిమిత్తం పోలీసులు జిల్లా ఉన్నతాధికారుల, కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు సమాచారం తెలియజేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తహశీల్దార్ భాగ్యలత, కమర్షియల్ ట్యాక్స్ అధికారి మధుసుధన్ రెడ్డిలు పత్రాలను పరిశీలించారు. అయితే వాహనంలో ఉన్న నగలను మాత్రం చూడలేదు. సోమవారం రాత్రి వరకు వాహనాన్ని చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. పూర్తి స్థాయిలో పత్రాలను పరిశీలించిన అనంతరమే వాహనాన్ని వదిలివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. బంగారు నగలు ఉన్న వాహనానికి సాయుధ బలగాలతో భద్రత కల్పించారు.

వరుస చోరీలతో ప్రజలు బెంబేలు

బొమ్మనహాల్ : బొమ్మనహాల్‌లో మూడు రోజుల నుంచి జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు భయభ్రాంతు లకు గురవుతున్నారు. గత శుక్రవారం పట్టపగలు పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో దొంగలు ద్విచక్ర వాహనం ఎత్తుకెళ్లారు. శనివారం వడ్డే క్యాంపులోని ఓ ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి విఫల యత్నం చేసినట్లు ఆ కుటుంబ యజమాని తెలిపారు. ఆదివారం పట్టపగలు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుని ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి బీరువా తాళం సైతం తీశారు. అందులో విలువైన వస్తువులేవీ లేకపోవడంతో అలాగే వదిలేసి వెళ్లిపోయారు. ఆయా సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐక్యవేదిక కో చైర్మన్‌గా కరణం హరికృష్ణ


అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్యవేదిక చైర్మన్‌గా జిల్లాకు చెందిన కరణం హరికృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ సాధారణ, సగటు ఉపాధ్యాయ, ఉద్యోగి గొంతుకగా ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. హరికృష్ణ ఎన్నిక పట్ల ఎన్‌టిఎ (నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్) జిల్లా శాఖ అధ్యక్షులు పీవీ శ్రీనివాసులు, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, వెంకటేష్‌బాబు, బాలసుబ్రమణ్యం, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీబాలాజీ హైస్కూల్ అధినేత కె.రామిరెడ్డి ఆకస్మిక మృతి



అనంతపురం : నగర సమీపంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న శ్రీబాలాజీ హైస్కూలు కరస్పాండెంట్, ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు రామిరెడ్డి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా మృతిచెందారు. ఈయన మృతికి ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, కార్యదర్శి గాజుల చంద్ర, తదితరులు నివాళులర్పించారు. కాగా ఈయన మృతికి కారణంగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రయివేట్ పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించాయి.

ఎన్నికలంటేనే ధన ప్రవాహంగా మారిన విషయం తెలిసిందే. ప్రచారంలో అడుగుతీసి అడుగు వేయాలంటే వేలల్లో ఖర్చు చేయాలి. హంగూ ఆర్భాటాలతో చేయాలంటే రోజుకు లక్షల్లోనే అవుతుంది. ఈ ఖర్చులతో అభ్యర్థులు ఖంగుతింటున్నారు. నీళ్లలో నోట్ల కట్టలు ఖర్చు చేయాల్సి రావడంతో ప్రచారం అంటేనే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది.



తడిసి మోపెడు..!

- ప్రచారమంటేనే వెనకడుగు వేస్తున్న అభ్యర్థులు
- రోజుకు సగటున రూ.5లక్షల వరకు ఖర్చు
- నామినేషన్ల తరువాత రెండింతలవుతుందని గుబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల షెడ్యుల్ వెలువడంతో ప్రచార హడావుడి పెరిగింది. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ ముఖ్యం కావడంతో అందరినీ బాగా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుంది. ఏ మాత్రం తేడా వచ్చిన ఫలితాలపై ప్రభావం ఉంటుంది. దీంతో టిక్కెట్టు ఖరారైన నాయకులు నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలూ సమకూర్చాల్సి ఉంటుంది. ఈ రకమైన ఏర్పాట్లు చేయడానికి నేతలకు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రచారాలకు బయటకు అడుగు పెట్టాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. సమయమైనా తక్కువ ఉంటే ఖర్చు కొంత తక్కువగా ఉండేదని, ఎన్నికల సమయం చాలా ఎక్కువగా ఉండటంతో రోజువారి ఖర్చు భారీగా పెరుగుతోందని అభ్యర్థులు సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసుకునే పరిస్థితులున్నాయి. దీంతో కొంత మంది ఇప్పటికప్పుడు ప్రచారాలు ప్రారంభించడం ఎందుకని తాము దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులను ప్రచారాలకు తిప్పుతున్నారు. వారైతే కొంత ఖర్చు తగ్గుతుందని, చివరాఖర్లో తాము ప్రచారాలు మొదలుపెడితే సరిపోతుందన్న భావనలోనున్నట్టు తెలుస్తోంది. ప్రచారం నిమిత్తం అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు బయటకు వెళితే రోజుకు సగటున ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు వస్తున్నట్టు ఒక అంచనా. ఇంకా ఎన్నికలకు 48 రోజుల వరకు సమయముంది. ఈ లెక్కన అన్ని రోజులకు కలిపి తక్కువలో తక్కువ అన్న రెండున్నర కోట్ల రూపాయల వరకు సాధారణ ఖర్చులకే అవుతోంది. ఇక నామినేషన్ల తరవాత నుంచి ఈ ఖర్చు రెండింతలు పెరిగే అవకాశముంది. ఆ తరువాత ఎన్నికల సమయంలో ఓటర్లకు పంచే డబ్బులు కలిపి మొత్తం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. పోటీ ఎక్కువ ఉన్న చోట మరింత భారం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యుల్ నాలుగో విడత కాకుండా ముందుగా వచ్చి ఉంటే చాలా వరకు ఖర్చు తగ్గి ఉండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. కులాలు, బలమున్న నాయకులను ఆకర్షించుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. అందుకు అవసరమైన తాయిళాలు, పనులు చేసి పెడుతున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎంత ఖర్చు అవుతుందోనని ప్రధాన పార్టీల అభ్యర్థులు భయపడిపోతున్నారు. ఇదే సమయంలో రంజాన్ వంటి పండుగలు కూడా రావడంతో ఇఫ్తార్ విందులు ఇవ్వాల్సి వస్తోంది. మైనార్టీలను ఆకట్టుకునేందుకు ఈ ప్రయత్నాలు సాగుతున్నాయి. నేరుగా తమ పేరు మీద కాకుండా అనుయాయుల పేర్లతో వారు విందు ఇస్తే తాము పాల్గొంటున్నట్టుగా సాగుతున్నాయి. యువతకు ప్రత్యేకమైన విందులు, క్రీడా సామగ్రి అందించే ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇన్ని రకాల ఖర్చులు వస్తున్నాయి. కోట్లాది రూపాయలు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. పెట్టకపోతే ప్రత్యర్థి కంటే వెనుకబడి పోతామన్న భయం వెంటాడుతోంది. ఇలా ఖర్చుతో అభ్యర్థులు ప్రచారం అంటేనే భయపడాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి.

కరువు ఛాయలు

కుదేలైన ఖరీఫ్-నిండా ముంచిన రబీ
అడుగంటిన భూగర్భజలాలు
పంటలు కాపాడుకునేందుకు రైతుల పాట్లు



మల్లాపురంలో ఎండిపోయిన మొక్కజొన్న

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఖరీఫ్ సీజన్ వర్షాధారంపై, రబీ సీజన్ బోరు బావులపై ఆధారపడి వ్యవసాయ రంగం నడుస్తుంది. ఏటా ఈ రెండు సీజన్లలో పంటలు పండించే రైతులకు వర్షాలు ప్రధానం. 2023 ఏడాదిలో అనువైన వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు చేతికందక వ్యవసాయ రంగం కుదేలైంది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం చేసిన అప్పులకు తోడు నష్టాలను మూట కట్టుకున్నారు. ఇక బోర్లలో ఉన్న నీటితో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు నిండా మునిగారు. బోరు బావుల్లో ఉన్న నీటిపై ఆధారపడి పంటలు సాగు చేయగా ఒక్కసారిగా నీటిమట్టం అడుగంటిపోవడంతో రైతులకు ఆశనిపాతంలా మారింది. కొన్నిబోర్లలో నీటిమట్టం తగ్గగా, మరికొన్ని బోర్లలో నీళ్ల ఆగిపోయాయి. ఖరీఫ్ సీజన్‌లో అనువైన వర్షాలు పడక పోవడంతో పాటు మండువేసవిలో బోర్లలో నీరు అడు గంటిపోవడంతో రైతులు నిండామనిగారు. దీంతో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు అన్నిరకాలుగా నష్టపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా క్షామఛాయలు అలుముకున్నాయి. అక్టోబర్ 1 నుంచి జనవరి ఆఖరి దాకా ఉండే రబీ సీజన్‌గా పరిగణిస్తారు. బోరు బావులు కింద పంటలు సాగు చేసే రైతులు కాస్త అటు ఇటుగా సాగు చేస్తుంటారు. రాయదుర్గం మండల పరిధిలో 2260.147 ఎకరాల్లో శనగలు, ఆముదం, గోరుచిక్కుడు, కొత్తిమీర, ధనియాలు, పత్తి, పొగాకు, వేరుశనగ, ఉలవలు, జొన్న, మొక్కజొన్న, వరి, కందులు, బీరకాయలు, గంధపు చెట్లు, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మహేంద్ర తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు ఉన్న బోర్లలో నీరు సరిపోవడం లేదు. మరికొంతమంది రైతుల పొలాల్లో నీరు ఆగిపోవడంతో పంటలను పొలాల్లోనే వదిలేశారు. కాస్తకూస్తో నీరున్న వారు పంటలను కాపాడుకునేందుకు ఇతరులు నుండి నీటిని ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనికితోడు వ్యవసాయానికి గతంలో 9 గంటల విద్యుత్ సరఫరా ఉండేది. నెల రోజుల క్రితం నుండి ఏడు గంటల సమయం మాత్రమే విద్యుత్ ఇస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా, అర్ధరాత్రి 12 గంటల నుంచి మూడు గంటల దాకా, కుదరనిపక్షంలో అర్ధరాత్రి ఒంటిగంట నుండి నాలుగు గంటల దాకా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు మిన్నకుండిపోయితున్నాయి. ఖరీఫ్ ఎలాగూ పోయింది.. రబీకైనా కాలువలకు నీరు వదులుతారని ఆశించిన జిల్లా రైతులకు అదికూడా నిరాశే మిగిలింది. ఏదిఏమైనా ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు నిండా మునిగి అప్పులపాలయ్యారని చెప్పవచ్చు.

ట్యాంకర్ల ద్వారా మడుగు నింపుకుంటున్నా
రైతు విశ్వనాథ్, మల్లాపురం

రెండు నెలల క్రితం మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న, పావు ఎకరాలో టమోటా సాగు చేశా. బోరు ద్వారా వచ్చే రెండున్నర ఇంచులు నీరు సరిపోయేవి. అయితే 20 రోజుల క్రితం ఉన్నట్టుండి నీరు తగ్గిపోయాయి. దీంతో పంటను కాపాడుకునే క్రమంలో పాటిల్ వారి క్రషర్ నుంచి రోజుకు నాలుగు, ఐదు ట్యాంకర్ల మేర నీటిని తీసుకొచ్చి పొలంలో మడుగు ఏర్పాటు చేసుకుని నింపుకుంటున్నా. మరుసటి రోజు మడుగులో ఉన్న నీటిని పంటకు వదులుకుంటున్నా.



మల్లాపురంలో ట్యాంకర్ నుంచి మడుగులోకి నీటిని నింపుతున్న విశ్వనాథ్



ఎండిపోతున్న వేరుశనగ

నీరు లేక పంటను వదిలేశా..
రైతు మహేష్, మెచ్చిరి

డిసెంబర్‌లో నాలుగున్నర ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. రెండు నెలలుగా బోరు నీరు ఆగిపోవడంతో వేరుశెనగ వాడు దశకు చేరుకుంది. చేసేదిలేక అలాగే వదిలేసా. తద్వారా రూ.1.23లక్షల వరకూ నష్టపోయా. ప్రభుత్వ అయినా ఆదుకోవాలి.

ఎండిన మొక్కజొన్న పంట
రైతు వీరేష్, మల్లాపురం

మూడు నెలల క్రితం మా సోదరులకు ఉన్న 3.70 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాం. సుమారు రూ.30వేల పైగా పెట్టుబడి పెట్టా. నెలరోజుల క్రితం నీరు అడుగంటిపోయింది. దీంతో మొక్కజొన్న పంట ఎండిపోయింది.

కనికరం కరువు..!

- 'ఆకలి చావు'పైనా కనిపించని స్పందన
- నానమ్మ భిక్షాటనతోనే పిల్లలకు తిండి
- సాయంత్రం చిన్నారుల వద్దకొచ్చిన ఐసిడిఎస్ అధికారిణి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఒక గర్భిణి ఆకలి చావుతో ఆదివారం నాడు మరణించింది. ఈ హృదయ విదారక ఘటన మనస్సున్న ప్రతి ఒక్కరినీ చలించివేసింది. అయితే అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం కన్పించలేదు. బాధిత కుటుంబం ఇప్పటికీ కలెక్టరేట్ ఎదుటనున్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ఎదుటే ఉంటోంది. మృతిరాలి భర్త రాజు ఎప్పటిలాగానే పూటుగా తాగిపడిపోయి ఉండగా, పిల్లలు అఖిల (14), చరణ్(12), సాయి(10)కు నానమ్మ భిక్షాటన చేసి తీసుకొచ్చిన తిండే సోమవారం కూడా ఆహారమైంది. ఉదయం నుంచి వారి స్థితిగతులు తెలుసుకున్న అధికారులెవరూ లేరు. సాయంత్రానికి మాత్రం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసరు చంద్రకళ వచ్చారు. ఆమె మృతురాలి భర్త రాజుతో మాట్లాడారు. బాలికను బాల సదనంలో చేరుస్తామని ఇద్దరు మగపిల్లలను వసతి గృహంలో చేరుస్తామని చెప్పారు. తాగిన మైకంలోనున్న రాజు దానికి కూడా అంగీకరించే పరిస్థితి కనిపించలేదు.

నానమ్మ బిక్షాటనతోనే పిల్లలకు ఆహారం


అకలితో మరణించిన అంజలి పిల్లలకు నాన్నమ్మ తులసమ్మ అనంతపురం నగరంలో బిక్షాటన చేసి ఆహారం పెడుతోంది. సోమవారం నాడు కూడా ముగ్గురు పిల్లలు బిక్షాటన చేసి తీసుకొచ్చిన ఆహారంతోనే కడుపనింపుకున్నారు. అది లేకుంటే పిల్లలు కూడా పస్తులుండాల్సిన పరిస్థితి ఉంది. ముగ్గురు పిల్లల చదువులు కూడా మధ్యలోనే ఆగాయి. అఖిల ఆరవ తరగతి వరకు చదువుకుని చదువు మానేసింది. ఇద్దరు మగపిల్లలు బడి మెట్లు ఎక్కిన దాఖలాలు లేవు. ఈ పిల్లలకు ఆధార్‌కార్డు కూడా ఇప్పటి వరకు లేకపోవడం గమనార్హం.

హాస్టల్‌లో చేరుస్తాం
చంద్రకళ, ఐసిడిఎస్ అధికారిణి.

మరణించిన అంజిలి ముగ్గురు పిల్లలను హాస్టల్‌లో చేర్చి మంచి విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ అధికారిణి చంద్రకళ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద ఉన్న అంజలి పిల్లలు, భర్తతో మాట్లాడారు. అంజలి కూతురు అఖిలను వెంటనే బాలసదనంకు తీసుకెళ్తామన్నారు. ఇద్దరు మగపిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పిస్తామన్నారు. మంగళవారం నాడు వారిని తీసుకెళ్లే ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు.

శింగనమల వైసిపిలో ఆగని ఇంటిపోరు..!

- అభ్యర్థి మార్పుపై పట్టువీడని అసమ్మతి నేతలు
- నేడు అనంతపురంలో సమావేశం



ప్రజాశక్తి-నార్పల

శింగనమల వైసిపిలో అసంతృప్తి జ్వాలలు తగ్గడం లేదు. సమన్వయకర్త మార్పు కోరుతూ ఆ పార్టీ నేతలు నిరసన గళాన్ని విన్పిస్తూనే ఉన్నారు. అభ్యర్థిని మార్చకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామంటూ వైసిపి అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం అనంతపురం గుత్తి రోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాల్‌లో శింగనమల నియోజకవర్గ వైసీపీ అసమ్మతి నేతలు సమావేశం నిర్వహిస్తున్నారు. బహిరంగంగానే వీరు తమ అసమ్మతి సమావేశాన్ని నిర్వహించబోతున్నారు. ఇప్పటికే పలుసార్లు వీరు సమావేశాలు నిర్వహించి అభ్యర్థిని మార్చాలని కోరారు. అయినా అధిష్టానం మాట వినకపోవడంతో ఈ సారి పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించి తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుత శింగనమల వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుకు ఎటువంటి పరిస్థితుల్లో మద్దతు ఇచ్చేదే లేదంటూ వారంతా నేడు జరిగే సమావేశంలో బహిరంగ ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి నాయకత్వంలో వీరాంజినేయులను గెలిపించాలని కోరుతూ నియోజకవర్గంలో వైసిపి ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారంలో కొందరు పాల్గొంటుండగా మెజార్టీ వైసిపి నాయకులు మాత్రం పాల్గొనడం లేదు. వైసీపీ నాయకుల మధ్య వర్గపోరు ఇంత బహిర్గతంగా జరుగుతున్నా అధిష్టానం మౌనంగా ఉండడం అసమ్మతి నేతలను మరింత అసహనానికి లోను చేస్తోంది. అభ్యర్థి ఎవరైనా ఓటర్లు కేవలం జగన్మోహన్ రెడ్డి బొమ్మను చూసి ఓటు వేస్తారన్న అతినమ్మకంలో అధిష్టానం ఉందన్న, ఇది సరికాదనే అసమ్మతి నేతల వాదన. స్థానిక నాయత్వం మాట వినకుండా అతినమ్మకం సరికాదంటున్నారు. నేడు నిర్వహించే అసమ్మతి నేతల సమావేశంలో శింగనమల వైసిపి పరిస్థితిపై పూర్తి స్థాయిలో అధిష్టానానికి తెలియజేసేలా సమావేశం నిర్వహించనున్నారు. ఈ పరిస్థితుల్లో వైసిపి ముఖ్య నాయకులు శింగనమలలో నెలకొన్న అంసతృప్తిపై ఎలా స్పందించారో వేచి చూడాల్సి ఉంది.

టిడిపికి కలిసొచ్చే అవకాశం..!

వైసిపిలో నెలకొన్న అసంతృప్తి వచ్చే ఎన్నికల్లో టిడిపికి కలిసొచ్చే అవకాశం ఉందని అధికార పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పటికే టిడిపి అభ్యర్థిగా బండారు శ్రావణిశ్రీని ప్రకటించింది. ఆమె ప్రచారాన్ని సైతం విస్తృతంగా చేస్తున్నారు. బండారు శ్రావణిశ్రీని అభ్యర్థిగా ప్రకటించగానే ఆ పార్టీలో సైతం కొందరు ముఖ్య నాయకులు తమ అసంతృప్తిని బహిర్గతం చేశారు. దీనిపై స్వయంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ స్పందించి అసంతృప్తి నేతలతో మాట్లాడారు. గెలుపు కోసం పని చేయాలని వారికి సూచించి అందరినీ కలిపారు. దీంతో టిడిపి నాయకులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రచారాలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపిలో నెలకొన్న అసమ్మతి వచ్చే ఎన్నికల్లో గెలుపుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆ పార్టీ మద్దతుదారులు తెలియజేస్తున్నారు.

ఆలయం వద్ద నవజాత శిశువు

ఆసుపత్రికి తరలించిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్



నవజాత శిశువును ఎత్తుకున్న ఐసిడిఎస్ అధికారిణి

రాయదుర్గం : పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన మధుగులమ్మ ఆలయం పక్క వీధిలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నవజాత ఆడ శిశువును వదిలి వెళ్లారు. పుట్టి ఒకటి, రెండు రోజులు గడిచిన పసికందు ఆలయం వద్ద ఏడుస్తూ ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈశ్వరి అక్కడికి చేరుకుని శిశువును స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హోలీ మంటలను వేస్తున్న ఆలిండియా బంజారా సేవాసంఘం నాయకులు

ఘనంగా హోలీ వేడుకలు

రంగులు చల్లుకుని యువత సంబరాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హోలీ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం హోలీ మాతకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని 2వ రోడ్డులోని బంజారా భవన్‌లో హోలీ మంటలు వేసి పండుగను ప్రారంభించారు. వర్షాలు బాగా కురవాలని, రైతులకు పంటలు బాగా పండాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కలిగి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం యువత రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబు నాయక్, రాష్ట్ర నాయకులు బాలానాయక్, రంగ్లానాయక్, బంజారా భవన్ స్థలదాత హరిశౌరి, ఎఐబిఎస్ఎస్ నాయకులు కె.అశోక్ నాయక్, ఠాగూర్‌నాయక్, రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణానాయక్, గోబ్రే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నిత్యసురభి' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఫుడ్ ప్యాకెట్లను అందజేస్తున్న నిర్మలమురళి

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గుత్తి రోడ్డు మసీదు, రాణీనగర్ మీనా మసీదు, లాల్‌బంద్ వీధి మసీదు, పాతూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెద్ద మసీదుల్లో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ఇఫ్తార్ విందుకు నబిరసూల్ సహకరించారన్నారు. రంజాన్ మాసంలో ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషకరమన్నారు. 350 మందికి ఇఫ్తార్‌విందు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైసిపిదే విజయం

వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, వీరాంజనేయులు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో జగనన్న విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎం.శంకరనారాయణ, ఎం. వీరాంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని లోలూరు, రఘునాథపురం, ఆకులేడు, నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. టిడిపి, జనసేన, బిజెపితోపాటు ఎన్ని పార్టీలు కూటమిగా వచ్చినా జగనన్నని తాకలేరన్నారు. గత టిడిపి పాలనలో పాలకులు దోచుకోవడానికి మాత్రమే పరిపాలించారన్నారు. వైసిపి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్నారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి మరోసారి సిఎం జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చిక్కల బాలకృష్ణ, ఎంపిటిసి మొరార్జీ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, వెంకటప్ప, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం



వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గుంజేపల్లి, నల్లపురెడ్డిపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, పిట్టు రంగారెడ్డి, ఆలం నాగార్జున నాయుడు, జనసేన రామకృష్ణ, గుంజేపల్లి కుళాయప్ప, శేఖర్‌రెడ్డి, జయరామ్, నరసింహులు, నాగేంద్ర, బాల చక్రవర్తి, భాస్కరయ్య, అశోక్, రామమోహన్, గోవర్ధన్, అదెప్ప, శ్రీరాములు, నారాయణస్వామి, మంగపట్నం సత్యనారాయణరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, శోదనపల్లి గోపాల్, లక్ష్మీనాయుడు, పిఎల్.లక్ష్మీనారాయణ, బండపల్లి కుళ్లాయప్ప, నాగభూషణ, చంద్రబాబు, తుపాకుల భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలతోనే : బండారు శ్రావణిశ్రీ

నార్పల : 'నా ధైర్యం, బలం ప్రజలే.. నా ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలతోనే ఉంటా.. ప్రజల మధ్యనే తిరుగుతా..' అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. గ్రామాలకు వెళ్తున్నప్పుడు వారు పలుకుతున్న అపూర్వ స్వాగతానికి శతకోటి వందనాలు అన్నారు. మీరు చూపించే ప్రేమ, ఆప్యాయతలను ఎన్నటికీ మరువలేనన్నారు. మీకోసం ఎలాంటి సమస్యలు ఉన్నా మీ తరఫున పోరాడటానికి తాను మీ ఇంట్లో ఆడపడుచులా ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. తాను నిత్యం ప్రజల్లోనే ఉన్నానని, ఈ ఐదేళ్లలో ప్రతి ఊరూ తిరిగానని, వారికి ఏ సమస్య ఉందో తనకు బాగా తెలుసు అన్నారు. అలాగే మండే ఎండను సైతం లెక్క చేయకుండా మాకోసం ప్రచారం చేస్తూ తమ వెంట నడుస్తున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. వీరు ఒక్కసారి తనను ఆశీర్వదిస్తే మీ సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నేరాలు ఘోరాలు



స్వాధీనం చేసుకున్న ఆర్మీ మద్యాన్ని చూపుతున్న సెబ్ అడిషనల్ ఎస్పీ

రూ.5.50 లక్షల విలువజేసే ఆర్మీ మద్యం పట్టివేత

ఒకరి అరెస్టు- 303 బాటిళ్లు స్వాధీనం

అనంతపురం : అనంతపురం జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో ఆర్మీ మద్యం పట్టుబడింది. ఆర్మీ క్యాంటీన్ నుంచి మద్యాన్ని తీసుకుని వచ్చి అక్రమంగా అదనపు డబ్బు కోసం విక్రయిస్తున్న మాజీ బిఎస్ఎఫ్ జవాన్‌ను అరెస్టు చేశారు. ఈయన నుంచి రూ.5.50 లక్షల విలువజేసే ఆర్మీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సెబ్ అడిషనల్ ఎస్పీ జి.రామకృష్ణ సోమవారం నాడు విలేకరులకు వెల్లడించారు. నార్పల మండలం తుంపెర గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి బిఎస్ఎఫ్‌లో జవానుగా పని చేసి రిటైర్ అయ్యారు. ఈయన అనంతపురం శిల్ప లేపాక్షి నగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. బెంగుళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో తను, తన సహచర రిటైర్డ్ జవాన్ల ద్వారా మద్యాన్ని కొనుగోలు చేసి వాటిని అనంతపురం తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయించేవాడు. ఒక్కో బాటిల్‌పై సుమారు రూ.250 దాకా అధికంగా విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో ఆర్మీ అక్రమ మద్యం వ్యాపారంపై ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్‌కు సమాచారం అందడంతో ఆయన సెబ్ అధికారులకు తెలియజేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సెబ్ అదనపు ఎస్పీ జి.రామకష్ణ పర్యవేక్షణలోఅనంతపురం సెబ్ స్టేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ వి.యల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురంలోని హనుమంతరెడ్డి నివాసంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 303(750ఎంఎల్) డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5.50 లక్షలు ఉంటుందని సెబ్ పోలీసులు తెలియజేశారు. వీటిని విక్రయిస్తున్న హనుమంతరెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ హెడ్ కానిస్టేబుళ్లు వెంకట నారాయణ, సతీష్, కానిస్టేబుళ్లు నారాయణస్వామి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

హమాలీ కాలనీలో ఆర్మీ, ఫారిన్ మద్యం పట్టివేత

అనంతపురం నగరంలోని హమాలీకాలనీలో ఫారిన్, ఆర్మీ మద్యం బాటిళ్లను పోలీసుల స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... హమాలీకాలనీలో నివాసం ఉంటున్న భరత్ రెడ్డి మాజీ సైనికోద్యోగుల కార్డులను సేకరించి బెంగుళూరులోని ఆర్మీ క్యాంటీన్ మద్యం బాటిళ్లు కొనుగోలు చేస్తున్నాడు. వాటిని అనంతపురం తీసుకుని వచ్చి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకునేవాడు. ఫారిన్ బ్రాండ్ల మద్యాన్ని కూడా బెంగుళూరులో అనంతకు తీసుకుని వచ్చి విక్రయించేవాడు. ఈ అక్రమ మద్యంపై పక్కా సమాచారం అందడంతో ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ ఆదేశాల మేరకు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ క్రాంతికుమార్, ఎస్ఐలు రుష్యేంద్ర బాబు, సలామ్‌ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం నాడు హమాలీకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆర్మీ, విదేశాలకు చెందిన 39 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకన్నారు. వీటిని విక్రయిస్తున్న భరత్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

13 బాక్సుల కర్నాటక మద్యం స్వాధీనం

అనంతపురం జిల్లా రాప్తాడులో కర్నాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకన్నారు. వీటిని విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 13 బాక్కులు (1248) కర్నాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి, రాప్తాడు సిఐ మునిస్వామి విలేకరులకు వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరు గ్రామానికి చెందిన రాకేష్, గుడుసాల మనోహర్, జి.మహేష్‌లు కర్నాటక మద్యాన్ని తీసుకొచ్చి రాప్తాడు ప్రాంతంలో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా కర్నాటకలోని ఎగువపల్లి నుంచి కర్నాటక మద్యాన్ని కొనుగోలు చేసి రాప్తాడు మండలం పాలచెర్లకు అక్రమంగా బొలెరోలో తరలిస్తున్నారు. ఈ సమాచారం పక్కాగా అందడంతో రాప్తాడు పోలీసులు సోమవారం ఉదయం పాలచెర్ల సమీపంలో తనిఖీలు నిర్వహించారు. బొలేరోలో తీసుకని వస్తున్న 13 బాక్సుల్లోని 1248 కర్నాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, బొలేరోజు సీజ్ చేసినట్లు పోలీసుల తెలిపారు.

కడవకల్లు గ్రామంలో..



మాట్లాడుతున్న ఎస్ఐ హేమాద్రి

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. యల్లనూరు మండలం కూచేవారిపల్లె గ్రామానికి చెందిన గోపాల్‌నాయుడు, పుట్లూరు మండలం కడవకల్లు గ్రామం నుంచి 10 మద్యం బాటిల్ తీసుకు వెళుండగా అనుమానం వచ్చి వాహనాన్ని తనిఖీ చేయగా మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రిజర్వాయర్ల నిర్మాణంపై సర్కారు బాధ్యతారాహిత్యం

సెల్ఫీ ఛాలెంజ్‌లో కాలవ శ్రీనివాసులు



ప్రతిపాదిత ఉంతకల్లు రిజర్వాయర్ స్థలం వద్ద కాలవ సెల్ఫీ

ప్రజాశక్తి-రాయదుర్గం

దశాబ్దాల కాలంగా తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టుకు సక్రమంగా నీరందక రైతులు పడుతున్న ఇబ్బందులను తీర్చడానికి టిడిపి హయాంలో ఉంతకల్లు రిజర్వాయర్‌ను ప్రతిపాదించామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా కాలవ సోమవారం ప్రతిపాదిత ఉంతకల్లు రిజర్వాయర్ వద్ద చివరి సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఆయకట్టు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో హెచ్ఎల్‌సికి 108వ కి.మీ. వద్ద సుమారు 18 కి.మీ. మేర కాలువ తవ్వి నేమకల్లు, ఉంతకల్లు మధ్యలో 5 టిఎంసి సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని టిడిపి హయాంలో ప్రతి ప్రతిపాదనలు సిద్ధం చేయించామని తెలిపారు. ఇక్కడి నుంచి జిల్లాలో ఎక్కడికైనా నీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌పై కనీస శ్రద్ధ పెట్టకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్ ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పి రైతులను మోసం చేశాడన్నారు. నేమకల్లు ఆంజనేయస్వామి రిజర్వాయర్ కోసం రూపొందించిన ప్రతిపాదనలను విస్మరించారని మండిపడ్డారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం వల్ల డీ.హీరేహాల్, కణేకల్లు, బొమ్మనహాల్ రైతులు హెచ్ఎల్‌సి ద్వారా ఏటా రెండు పంటలు పండించుకోవచ్చన్నారు. వచ్చే చంద్ర బాబు ప్రభుత్వంలో ప్రజల ఆశీస్సులతో ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

నేమకల్లు రిజర్వాయర్ నిర్మాణంలో ప్రభుత్వం విఫలం : కాలవ

బొమ్మనహాల్ : నేమకల్లు రిజర్వాయర్ నిర్మాణంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రాయదుర్గం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. కాలవ సోమవారం మండలంలోని నేమకల్లు సమీపంలో నిర్మించనున్న ఆంజనేయస్వామి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ఈ రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్ రాయదుర్గం ప్రజలు, రైతుల కోసం నేమకల్లు రిజర్వాయర్ నిర్మించడంతో పాటు, గుమ్మఘట్ట మండలంలోని బిటిపి డ్యాంకు కృష్ణా జలాలు తెప్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు అందాల్సిన తుంగభద్ర నీరు సకాలంలో అందించలేకపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే గుమ్మఘట్ట డ్యాంకు కృష్ణా జలాలు అందిస్తామని, నేమకల్లు ఆంజనేయస్వామి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని కాలవ హామీ ఇచ్చారు. కాలవ వెంట మండల కన్వీనర్ బలరామిరెడ్డి, హనుమంతరెడ్డి, చంద్రహాస్, కొత్తపల్లి మహేంద్ర, గురుప్రసాద్, అప్పారావు, సైకిల్ షాప్ హనుమంతు, సంగప్ప, కేశప్ప, నాగరాజు, కంచప్ప, బసప్ప, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ధాన్యం లంచంగా తీసుకోవడం దారుణం

హెచ్ఎల్‌సి అధికారులపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

రైతుల నుంచి ధాన్యం లంచంగా తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు ధోని ప్రతాపరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కణేకల్లు మండలంలోని హెచ్.ఎల్.సి కార్యాలయంలో పని చేసే అధికారులు లంచంగా 75 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకోవడం దారుణమన్నారు. తుంగభద్ర నది నుంచి హెచ్ఎల్‌సి కాలువ కింద ఆంధ్ర వాటాగా రావాల్సిన నీటిని కూడా సక్రమంగా సరఫరా చేయలేని అధికారులు రైతుల నుంచి ధాన్యాన్ని లంచంగా స్వీకరించడం అమానుషమన్నారు. హెచ్ఎల్‌సి వాటా నీటిని సక్రమంగా తీసుకోకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో అందిన నీటితో పంటలు పండించిన రైతుల వద్ద నుంచి అధికారులు ధాన్యాన్ని లంచంగా తీసుకోవడం దారుణమైన చర్య అన్నారు. దీనిపై సాగునీటి పారుదల శాఖ, హెచ్ఎల్‌సి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లంచంగా ధాన్యం తీసుకున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిచో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

హరేసముద్రం విఒఎ తొలగింపు

అనంతపురం కలెక్టరేట్ : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీలు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బొమ్మనహాల్ మండలం హరేసముద్రం శారద గ్రామ సంఘం విఒఎ టి.నాగరాజును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిఆర్‌డిఎ ఐకెపిలో విఒఎగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఈనెల 18న బొమ్మనహాల్ మండలం పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడని ఫిర్యాదు రావడంతో డిఆర్‌డిఎ–ఐకెపి అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి విచారణ చేయించారు. విచారణలో ప్రచారంలో పాల్గొన్నట్లు నిర్ధారణ కావడంతో నాగరాజును విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న గుమ్మనూరు జయరాం సోదరుడు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలో మృతిచెందిన హనుమన్న కుటుంబాన్ని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ పరామర్శించారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి నివాళు ర్పించారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జింకల నారాయణస్వామి, టిడిపి నాయకులు రవితేజ నారాయణస్వామి, జక్కలచెరువు ప్రతాప్, గుల్బర్గా గోవిందు, రవితేజ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గేట్స్ కళాశాల డైరెక్టర్ శ్రీవాణి

గుత్తి : పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వేసవి సమయంలో ప్రజల దాహార్తి తీర్చడం తమ సామాజిక బాధ్యతగా భావించి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చలివేంద్రం ఏర్పాటుకు కళాశాల యాజమాన్యం ప్రోత్సాహం ఉందన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగాధిపతి అర్చక ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

వాలంటీర్లపై ప్రతిపక్షాల ఆరోపణలు తగవు : మెట్టు

రాయదుర్గం : శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సిద్ధార్థరెడ్డి వాలంటీర్లను స్లీపర్ సెల్స్, టెర్రరిస్టులుగా చిత్రీకరించడాన్ని నియోజకవర్గవ వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఖండించారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ పట్టణ సమన్వయకర్త ఆరవ శివప్ప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్పతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి పాలనలో జన్మభూమి కమిటీల అవినీతి వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందలేదన్నారు. వైసిపి ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా కుల, మత, రాజకీయపార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందాయని, ఇది ప్రతిపక్షాలకు మింగుడు పడలేదన్నారు. ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగేం దుకు అవకాశం లేక వాలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా ఆరోపణలు చేయడం తగదన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కాలవ శ్రీనివాసులు సెల్ఫీ ప్రకటనలపై స్పందిస్తూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు బిటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలి బాషా, కౌన్సిలర్లు మంజునాథ, దేవరాజ్, శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు పొరాలు శివ, దివాకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

శ్రావణిశ్రీని గెలిపించుకుందాం

శింగనమల: వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుందామని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని సలకంచెరువు, బందార్లపల్లి గ్రామాల్లో టిడిపి మండల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా మహాశక్తి పథకం కింద చదువుకున్న ప్రతి విద్యార్థికీ 15వేలు, 18ఏళ్ల నిండిన ప్రతి మహిళకూ రూ.1500, దీపం పథకం కింద ప్రతి ఇంటికీ మూడు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏటా రూ.20వేల ఆర్థికసాయం, యువకులం పేరిట రూ.20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికీ రూ.3వేలు, ప్రతిఇంటికీ ఉచిత మంచి నీటి సౌకర్యం, బీసీలకు రక్షణ చట్టం వంటి పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు



కరపత్రాలు అందజేస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజల ముంగిటకే పాలన : 'అనంత'

అనంతపురం : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 1, 4వ డివిజన్లలో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధి, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేస్తూ వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ఇంటి మింగింటికే పరిపాలన తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కావున జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.